అక్కాచెల్లెమ్మలే జగనన్నకు అండ

- చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మకండి
- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: అక్కా చెల్లెమ్మలు బాగుంటేనే కుటుంబం, రాష్ట్రం బాగుంటుందని, మహిళ సాధికారికతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారని, అక్కా చెల్లెమ్మలే జగనన్నకు అండగా నిలుస్తారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రాంగణంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సంక్షేమ పథకాలు వారికే అందేలా చర్యలు చేపట్టారని చెప్పారు. మంత్రాలయం నియోజకవర్గంలో 3,114 గ్రూపులకు 31,140 మంది పొదుపు మహిళలకు నాల్గు విడతల్లో రూ.57.23 కోట్లు జమ చేశారన్నారు. కోసిగిలో 870 గ్రూపులకు రూ.20. 04 లక్షలు జమ చేశారని, నాల్గవ విడుతతో రూ.5.96 కోట్లు విడుదల చేశారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మోసపూరిత మాటలతో మీ ముందుకు వస్తాడని, ఆయన కేవలం మాటలతోనే సరిపెడతాడని, చేతల్లో ఉండవని నమ్మొద్దని సూచించారు. గతంలో ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి, డ్వాక్రా రుణాల మాఫీ అంటూ హామీలు ఇచ్చాడని, వాటిని అమలు చేశాడా అని ప్రశ్నించారు.

కోసిగి అభివృద్ధికి ప్రత్యేక కృషి..

నియోజకవర్గంలో వెనుకబడిన కోసిగి ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేశానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికలల్లో ఇచ్చిన మాట ప్రకారం తాగు, సాగునీటి అందించేందుకు రూ.6 కోట్లతో పులికనుమ నుంచి సాగునీటి పైప్‌లైన్ వేయించానన్నారు. త్వరలో తాగునీటి సౌకర్యార్థం భూగేని చెరువు స్టోరేజీ ట్యాంక్ సిద్ధం చేశామని, రూ.30లక్షలు వెచ్చించి ఫిల్లర్స్ బెడ్స్ ఏర్పాటు చేసి సురక్షితం నీటిని అందిస్తామన్నారు. మాలపల్లి నుంచి పల్లెపాడు, చింతకుంట మీదుగా కోసిగి వరకు రోడ్డు పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కోసిగిలోనే రూ.3కోట్లతో 40 సీసీ రోడ్లు వేయించామని చెప్పారు. తహసీల్దార్ రుద్రగౌడ, సీఐ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బెట్టన గౌడ, ఇల్లూరి ఆదినారాయణ,శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ పవిత్ర పాటిల్, మహంతేష్ స్వామి, మంగమ్మ, మాణిక్య రాజు, కోసిగయ్య, జగదీష్ స్వామి, బుల్లి నరసింహులు, నూర్ అహ్మద్, షౌకత్ అలి, నరసన్న, నరసింహులుగౌడ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

29న ప్రజ్ఞా వికాసం పరీక్షలు

ఆదోని సెంట్రల్: ఈనెల 29వతేదీన పదవ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. గురువారం యూటీఎఫ్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారికి అవగాహన కల్పించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో ధైర్యం నింపేందుకు విద్యావేత్త కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ రావు పర్యవేక్షణలో ఎస్ఎఫ్ఐ కమిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలం, పట్టణం, నగరస్థాయిలో జరిగే పరీక్షల్లో జిల్లాలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. నాయకులు గౌస్, శశిధర్, గణేష్, భరత్ కుమార్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

వైభవం.. చౌడేశ్వరిదేవి రథోత్సవం



భక్త సమూహం నడుమ రథోత్సవం, (ఇన్‌సెట్)పూజలందుకున్న చౌడేశ్వరిదేవి



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.ధరణీధర్‌రెడ్డి

పెద్దకడబూరు: మండలంలోని హనుమాపురం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, తులసీ అర్చన, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం నైవేద్యాలు నివేదించి మహా మంగళహారతులు పట్టారు. గ్రామస్తులు పిండివంటలు నైవేద్యాంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా పూజారి చంద్రప్ప ఇంటి నుంచి మేటి కుంభంతో ఊరేగింపుగా వచ్చి రథానికి ప్రత్యేక పూజలు గావించారు. మంగళహారతులు అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని రథంపై ఆశీనులు గావించి అశేష భక్తజనుల మధ్య మేళ తాళాలతో, డప్పు, సన్నాయి వాయిద్యాల నడుమ రథాన్ని ముందుకు కదలించారు. గ్రామ బొడ్రాయి వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు వై.ధరణీధర్‌రెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయిత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు విజయేంద్రరెడ్డి, సర్పంచ్‌లు ఇంద్ర, రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న వీరశైవ విద్యార్థులు

ఆదోనిఅర్బన్: స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో అఖిలభారత వీరశైవ మహాసభను రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానంద అధ్యక్షతన చేపట్టారు. కార్యక్రమంలో పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ లింగ దేవరు చేతులమీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఆలిండియా కార్యదర్శి రేణుకప్రసన్న మాట్లాడుతూ వీరశైవులు ఐక్యంగా ఉడాలని, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు నాలుగు రాష్ట్రాల్లో 90 శాతంపైగా మార్కులు సాధించిన వారికి స్కాలర్‌షిప్‌లను కూడా అందిస్తామన్నారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణను ఉచితంగా అందిస్తామన్నారు. సుగూరప్ప, యగ్గటి ప్రతాప్, పాల్తూరు మల్లికార్జునస్వామి, ఏపీ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, దేశాయ్ చంద్రన్న, శివరుద్రప్ప, రిటైర్డ్ ఎంఈఓ గురునాథయ్య పాల్గొన్నారు.

29 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

ఆదోనిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి వారు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రతిపాదించిన చార్జీలపై వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ వినియోగదారులకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారని విద్యుత్‌శాఖ డీఈఈ సుధాకర్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక డీఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా వినియోగదారులు అభ్యంతరాలు తెలియజేసేందుకు 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు నాలుగు రోజులపాటు నిర్వహించే బహిరంగ ప్రజాసేకరణకు రెండు రోజుల ముందే నియంత్రించిన చార్జీలపై మెయిల్ ఐడీలో ఫిర్యాదు చేయాలన్నారు. మెయిల్ ఐడీలో ఫిర్యాదు చేస్తే వారికి ఈనెల 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీ అభ్యంతరాలు తెలియజేసేందుకు ఒక తేదీ కేటాయిస్తారని చెప్పారు. commn& secy@aperc.gov.in మెయిల్ ఐడీలో అభ్యంతరాల కోసం రెండు రోజుల ముందే పంపాలన్నారు. ప్రతిపాదించిన కొత్తవి, పాతవి చార్జీల పట్టిక కావాల్సిన వారు ఏపీఈఆర్‌సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్‌శాఖకు సంబంధించిన కమిషన్ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, మెంబర్ టెక్నికల్ ఠాకూర్ రామ్‌సింగ్, వెంకటరామిరెడ్డి ఉంటారని వివరించారు.

ఓటు.. ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు

- ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి
- సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ



భీమాస్ సర్కిల్‌లో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సబ్‌కలెక్టర్



కోసిగిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఆదోనిరూరల్: ఓటు.. ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టులాంటిదని, సామాన్యుడి చేతిలో వజ్రాయుధం అని, అమూల్యమైన ఓటును ప్రతిఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సబ్‌కలెక్టర్ శివ నారాయణశర్మ పేర్కొన్నారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం–2024 అవగాహన కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులు, అధికారులు కలిసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. టూటౌన్ పోలీసు స్టేషన్ మీదుగా భీమాస ప్రధాన కూడలి చేరుకొని మానవహారం నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. ముఖ్య అతిథులుగా సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర రఘునాథ్‌రెడ్డి, ఆదోని తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతా వాణి, డీఎల్‌డీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, ఎంఈఓ శివరాముడు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా తయారీలో భాగస్వాములైన అధికారులు, డివిజన్ యంత్రాంగం, ఎన్నికల కమిషన్ తరఫున అభినందనలు తెలిపారు. అనంతరం సీనియర్ ఓటర్లు ఈరన్న, డి.గోపాల్‌రావును సబ్‌కలెక్టర్ సన్మానించారు. చివరగా ఈవీఎం మిషన్ల పనితీరుపై నూతన ఓటర్లకు అవగాహన కల్పించారు. మండలంలోని సాదాపురం, గోనబావి గ్రామాల్లో ఏఈఆర్‌ఓ విజయ్‌శేఖర్, పెద్దహరివాణం గ్రామంలో, పట్టణంలోని అమరావతి నగర్ పోలింగ్ కేంద్రం 208, 209, 210, 211 కేంద్రాల్లో ఈవీఎంల పనితీరుపై ఏఈఆర్‌ఓ వీరభద్రప్ప, డిప్యూటీ తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్ ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు.

కోసిగి: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ రుద్రగౌడ పేర్కొన్నారు. గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఆర్వోలు, గ్రామ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ఎంఈఓ నాగేశప్ప, హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, ఆర్ఐ శ్రీరాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలను జరుపుకున్నారు. భక్తుల రాకతో దర్గా పరిసరా ప్రాంతాలు సందడిగా మారాయి. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



చిన్నకడబూరులో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దకడబూరు : మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని చిన్నకడబూరులో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో రామంజి, తాయన్న ఇళ్లల్లో 5బాక్స్‌ల కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశాన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి జోనాథన్ వీక్లిఫ్ అధ్వర్యంలో మాలపల్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులకు డానియేల్ ప్రేమ్‌కుమార్ ద్వారా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గురువారం కళాశాల జాతీయ సేవా పథకం ద్వారా చేపట్టిన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏడు రోజులు పాటు సదస్సులో పాల్గొని గ్రామస్తులతో మమేకమవుతారని తెలిపారు.

స్వేచ్ఛగానే పని చేస్తున్నా..



నాగరాజ్‌గౌడ్

కౌతాళం: తాను స్వేచ్ఛతోనే పని చేస్తున్నానని, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుటుంబంలో కుటుంబ సభ్యుడిగా ఉన్నానని ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుధవారం తిక్కారెడ్డి ఉరుకుందలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో స్వేచ్ఛ లేదని, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్‌కు కూడా స్వేచ్ఛ లేకుండా పోయిందని, తమ హయాంలో నియోజకవర్గ ఇన్‌చార్జుగా ట్రస్టుబోర్డు విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తనకు బాలనాగిరెడ్డి ఎంతో స్వేచ్ఛ ఇచ్చారని అందుకే పార్టీ మండల కన్వీనర్‌గా, కౌతాళం సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా, ఆ తర్వాత ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్‌గా నియామకంలో సహకరించారని చెప్పారు. పార్టీలో, ఎమ్మెల్యే వద్ద స్వేచ్ఛ ఉన్నందుకే తనకు ఇన్ని పదువులు వచ్చాయని, స్వేచ్ఛ ఉన్నందుకే ఉరుకుంద క్షేత్ర అభివృద్ధి జరుగుతోందన్నారు.

క్రీడాకారులకు పురస్కారాలు



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లు, క్రీడాకారులకు గురువారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అవరణలో ప్రతిభా పురస్కారాలను అందించారు. ఇందుకు ఎమ్మెల్సీ మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ గీతావాణి, పురపాలక చైర్‌పర్సన్ శాంతి, ఎంఈఓలు శివరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

మంత్రాలయం : ఆడుదాం- ఆంధ్ర క్రీడ పోటీల్లో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి ఖో-ఖో, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఖో-ఖో పురుషుల విభాగంలో మంత్రాలయం, కోసిగి జట్లు తలపడగా కోసిగి జట్టు విజయం సాధించింది. వాలీబాల్ పోటీలో మంత్రాలయం, కోసిగి జట్లు మధ్య పోటీ జరగగా మంత్రాలయం జట్టు గెలుపొందింది. ఎంపీడీఓ మణిమంజరి నేతృత్వంలో పోటీలు నిర్వహించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కౌతాళం : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం మండలంలోని ఎరిగేరి గ్రామంలో సర్పంచ్ గోవిందు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు డ్రోన్ ద్వారా పంటలపై మందుల పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

మానసిక సమస్యలపై అవగాహన

ఆదోనిఅర్బన్: జాతీయ, జిల్లా మానసిక ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు మానసిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్లు చైతన్య, సైక్రియాటిస్ట్ చైతన్య నేరెళ్ల, సైకాలజిస్ట్ వెంకటసుబ్బయ్య ఆత్మహత్యల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఉపకార వేతనానికి ఎంపిక

ఆదోని సెంట్రల్: స్థానిక సెయింట్ ఆంథోని ఎయిడెడ్ హైస్కూల్‌లో విద్యార్థిని ఎం.అంజినమ్మ, ఆర్ఆర్ లేబర్ కాలనీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వై. మహేష్, ఎం. వైష్ణవి, బి. హర్షిత, నెహ్రూ మెమోరియల్ పాఠశాల నుంచి వైష్ణవి, ఉదయ్, చైత్ర, షేక్షావలి, చైతన్య ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని హెచ్‌ఎంలు గురువారం తెలిపారు.